సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 7 । జూలై । 2023



అనుమానం పెనుభూతమై..

ఓ వ్యక్తి భార్యను అతి కిరాతకంగా చంపి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,419
3 శాతం జీఎస్టీతో	రూ.5,581
సవర (8 గ్రా)	రూ.44,648

గరిష్టం/కనిష్టం
35.7 /28.9

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలిలో 48 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

జిల్లా పరిషత్‌లో పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ చిరంజీవి

నెల్లూరు(పొగతోట): జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలోని మండలాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురికి ఏఓలుగా పదోన్నతులు కల్పిస్తూ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ బి.చిరంజీవి చర్యలు తీసుకున్నారు. గురువారం నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో సంబంధిత ఉత్తర్వులను అందజేశారు. చేజర్ల ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న జి.వేణుగోపాల్‌రావును వరికుంటపాడుకు, కలువాయిలో పనిచేస్తున్న టి.రాజశేఖర్‌ను కలువాయికి, అల్లూరులో పనిచేస్తున్న కె.చంద్రశేఖరిను జలదంకికి, వాకాడు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.మురళీకృష్ణను వింజమూరుకు బదిలీ చేశారు. పదోన్నతులు కల్పించినందుకు చైర్‌పర్సన్, సీఈఓకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, బోగ్యం రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

36 మందికి హెచ్‌ఎంలుగా..

నెల్లూరు(టౌన్): 36 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ ఇచ్చారు. నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఉత్తర్వులు అందజేశారు. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌లో ఖాళీగా ఉన్న 36 పోస్టులకు సీనియారిటీ ప్రాతిపదికన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించారు. అదే విధంగా ఆరుగురు పీఈటీలకు ఫిజికల్ డైరెక్టర్లుగా పదోన్నతి ఇచ్చారు. వీరంతా వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని డీఈఓ గంగా భవాని ఆదేశాలిచ్చారు.

1.02 లక్షల సమస్యలు పరిష్కారం

- జేసీ రోణంకి కూర్మనాథ్



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న సురక్ష' ప్రత్యేక శిబిరాల్లో ఇప్పటి వరకు జిల్లాలో 1.02 లక్షల మంది సమస్యలు పరిష్కరించినట్లు జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఆయన నెల్లూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో జిల్లాలో మూడు దశలుగా జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇప్పటి వరకు 1,02,389 సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అర్హులను గుర్తించి సేవలందిస్తున్నట్లు చెప్పారు. 'జగనన్నకు చెబుదాం'కు అనుసంధానంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ పంపిణీలో భాగంగా జిల్లాలో 2,800 మందిని గుర్తించామని, సుమారు 3200 ఎకరాల పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. భూముల రీ సర్వే ప్రక్రియపై తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పచ్చనేతల పాపాలెన్నో..

2014 – 19 సంవత్సరాల మధ్య జిల్లాలో టీడీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలకు లెక్కే లేదు. రూ.కోట్లను స్వాహా చేసిన ఘనులున్నారు. అవన్నీ టీడీపీ అధిష్టానానికి కూడా తెలుసు. అయితే యువగళం పాదయాత్రలో టీడీపీ నేత లోకేశ్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై ఇష్టారీతిగా ఆరోపణలు చేస్తూ నవ్వులపాలవుతున్నారు. దీంతో జోష్ నింపుతుందనుకున్న పాదయాత్ర కాస్త కొత్త తలనొప్పి తెస్తుండడంతో ఆ పార్టీ శ్రేణులు అసంతృప్తిగా ఉన్నాయి.

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై లోకేశ్ విమర్శలు
- ప్రతి చోటా స్క్రిప్ట్ చదువుతూ నవ్వులపాలు
- నిజానికి ఆయన పక్కనే అవినీతికి బ్రాండ్ అంబాసిడర్లు
- టీడీపీ హయాంలోనే భారీ కుంభకోణాలు
- ఆ పార్టీ నేతల వల్ల అధికారుల బలి



టీడీపీ హయాంలో ఉదయగిరి నియోజకవర్గంలో చెరువు వంకపై నాసిరకంగా నిర్మించిన చెక్‌డ్యామ్ తలుపులు ఊడిపోయిన దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలు, అరాచకాలకు జిల్లా కేరాఫ్‌గా నిలిచింది. ప్రతి కుంభకోణం వెనుక పచ్చనేతలే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిల్లర్లు, అధికారులు, అప్పటి మంత్రులతో కుమ్మక్కై సీఎంఆర్ బియ్యం సరఫరా విషయంలో భారీ అవినీతికి పాల్పడ్డారు. 2015–16 ఏడాదిలో ప్రభుత్వం 3.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ప్రభుత్వం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం మిల్లర్లకు ధాన్యం సరఫరా చేసింది. వారు తిరిగి 2.16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి గానూ 1.97 లక్షలు మాత్రమే అప్పగించారు. ఇంకా 18,905 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి ఏర్పడింది. దీని విలువ రూ.36 కోట్లు. అప్పటి నుంచి మిల్లర్లు బియ్యం ఇవ్వకపోవడంతో వారికి జరిమానాలతోపాటు 2017 నాటికి బకాయిలు రూ.56 కోట్లకు చేరింది. మొత్తం 37 మంది మిల్లర్లు అక్రమాలకు పాల్పడినట్లు లెక్క తేలింది. అప్పటి ప్రభుత్వ పెద్దలు మిల్లర్లకు అండగా నిలవడంతో నామమాత్రపు కేసులతో సరిపెట్టారు. ఆపై ఏకంగా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిపించి రికార్డులు కాలిపోయేలా చేశారు.

2018లో పునాది

2018 నుంచే ధాన్యం రవాణా చార్జీల కుంభకోణానికి పునాది వేశారు. అప్పట్లో పౌర సరఫరాల సంస్థ డీఎంగా రోజ్‌మాండ్ పని చేసేవారు. ఆమె హయాం నుంచే ధాన్యం రవాణా చార్జీలు నగదు పక్కదారి పట్టించినట్లు అధికారుల విచారణలో తేలింది. అప్పటి నుంచి పనిచేసిన అధికారులందరూ కలిసి అక్రమాల పరంపరను కొనసాగించి దాదాపు రూ.40 కోట్లు స్వాహా చేశారని తెలిసింది. ఈ వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి విచారణ చేయించింది. 20 మందిని జైలుకు పంపారు.

మెప్పు కోసం..

పాదయాత్రలో టీడీపీ నేత లోకేశ్ చేస్తున్న ఆరోపణలపై సొంత పార్టీలోనే వ్యతిరేకత వస్తోంది. ఎవరో మెప్పు కోసం రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ నవ్వులపాలు అవుతున్నాడని ఆ పార్టీ నేతలే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు రూరల్, ఉదయగిరి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోనే అక్రమాలు చోటు చేసుకున్నాయని నాలుగేళ్లుగా టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతాల శాసనసభ్యులు ముగ్గురు ప్రస్తుతం లోకేశ్ వెంటే ఉన్నారు. వారు కండువా మార్చగానే మంచివారవుతారా? అనేది ప్రతి ఒక్కరి మదిని తొలుస్తున్న ప్రశ్న? నిన్నటి వరకు అరాచకాలు చేసిన వారిని దుమ్మెత్తిపోసిన టీడీపీ నేతల మాటలు ఇప్పుడు ఉత్తివేనని తేలిపోయిందా? అంటూ ఆ పార్టీ శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి. తమను ముప్పుతిప్పలు పెట్టిన వారితో కలిసి తప్పంతా ప్రభుత్వానిదే అంటూ బురద జల్లుతున్న లోకేశ్ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

ఇవి కూడా..

- ఉదయగిరిలో పసుపు కుంభకోణం వెనుక పచ్చనేతలున్నారు. దాదాపు రూ.30 కోట్లను స్వాహా చేశారు. ఈ వ్యవహారంలో కూడా పలువురు అధికారులు జైలుపాలయ్యారు.
- టీడీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.14.27 కోట్ల నిధులు తెలుగు తమ్ముళ్లు పక్కదారి పట్టించినట్లు సామాజిక తనిఖీ బృందాలు నిగ్గు తేల్చాయి.
- నీరు – చెట్టు పథకంలో చేపట్టిన పనుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.200 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలోనే ఫైబర్ చెక్‌డ్యామ్‌ల పేరుతో రూ.80 కోట్ల వరకు నిధులు స్వాహా జరిగినట్లు గుర్తించారు.
- దామవరం విమానాశ్రయం భూ సేకరణలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పచ్చనేతల బినామీ పేర్లు నమోదు చేయించుకుని పరిహారం బొక్కేశారు. అప్పట్లో కలెక్టర్ విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకున్న సంఘటనలు ఉన్నాయి.
- దగదర్తి మండలంలోని టీడీపీ నేతలు రూ.వంద కోట్ల విలువైన సహజ వనరులను దోపిడీ చేశారు.
- కలువాయి మండలం పెరంకొండలో భూపరిహార కుంభకోణంలో కూడా రూ.కోట్ల స్వాహా పర్వం టీడీపీ హయాంలోనే జరిగింది.
- రైతు రథంలో కమీషన్ల నుంచి ప్రతి కుంభకోణం టీడీపీ హయంలో జరిగిన విషయాలను ఇంకా జిల్లా వాసులు మరిచిపోలేదు. యువగళంలో లోకేశ్ అక్రమార్కులను పక్కన పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమాలు, అవినీతి జరిగిందంటూ పసలేని ఆరోపణలు చేయడంపై జిల్లా వాసులు నివ్వెరపోతున్నారు.

ప్రజలకు ఎంత మంచి జరుగుతున్నా ఈనాడు మాత్రం అబద్ధాలతోనే కాలం వెళ్లదీస్తోంది. మార్కెట్లో టమాటా ధరలు పెరిగాయి. దీనికి సాగు తగ్గుముఖం పట్టడమే కారణం. ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం రైతు బజార్లలో సబ్సిడీపై టమాటాలను అందజేస్తోంది. అయితే అరకొరగా ఇస్తున్నారని ఈనాడు ఈనెల 5వ తేదీన కథనం ప్రచురించింది. వాస్తవం ఏంటంటే ఇప్పటి వరకు 13 వేలమందికి పైగా రాయితీపై టమాటాలు అందుకున్నారు. ఈ విషయాన్ని మాత్రం ఆ పత్రిక చెప్పదు.

రాయితీపై ఇస్తున్నా.. ఈనాడు అబద్ధాలు


రాయితీ టమోటా.. అరకొరే!

- టమాటా సాగు తగ్గుముఖం
- ధర పెరగడంతో సబ్సిడీపై ఇస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 4 రైతు బజార్లలో పంపిణీ
- అరకొరగానే అంటూ ఈనాడు తప్పుడు రాతలు



ఇటీవల నెల్లూరులో సబ్సిడీపై టమాటాలు తీసుకుంటున్న వినియోగదారులు

ఇప్పటి వరకు..

టమాటాలు తీసుకున్న వారు :	ఎన్ని కేజీలు :
13,800 మంది	సుమారు 18 వేలు

నెల్లూరు(సెంట్రల్): సాగు తగ్గిన నేపథ్యంలో టమాటాల ధరలకు రెక్కలొచ్చాయి. మన రాష్ట్రంలోనే కాదు.. అనేక చోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నేరుగా రైతుల వద్ద కొనుగోలు చేసి ప్రజలకు సబ్సిడీపై పంపిణీ చేస్తోంది.

రూ.50కే...

కొద్దిరోజుల క్రితం టమాటా ధరలు పెరిగాయి. కిలో రూ.100 మార్కుకు చేరాయి. దీంతో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. గత నెల 30వ తేదీన నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట, నవాబుపేట, కావలి, కందుకూరుల్లోని రైతుబజార్లలో కిలో రూ.50కే విక్రయాలు చేయడం ప్రారంభించింది. అందరూ తీసుకునేందుకు వీలుగా ఒక రేషన్‌కార్డుకు రెండు కిలోల చొప్పున విక్రయాలు చేస్తోంది.

రూ.10 లక్షలకు పైగా..

పలమనేరు, మదనపల్లి ప్రాంతాల నుంచి కిలో రూ.110 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసి వినియోగదారులకు సబ్సిడీపై అందిస్తోంది. ఇప్పటి వరకు 13,800 మందికి సుమారు 18 వేల కేజీలను జిల్లాలోని నాలుగు రైతుబజార్ల ద్వారా విక్రయాలు చేశారు. రూ.10.80 లక్షల వరకు ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించింది. టమాటాల ధర తగ్గే వరకు ఎంత భారమైనా రాయితీపై పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇబ్బందుల్లేకుండా పంపిణీ చేస్తున్నాం

ఇప్పటి వరకు 18 వేల కేజీల టమాటాలను సబ్సిడీపై పంపిణీ చేశాం. ధరలు తగ్గే వరకు అందజేయడం జరుగుతుంది. మదనపల్లి, పలమనేరు ప్రాంతాల్లో సాగు తగ్గడంతో ధర పెరుగుతోంది.

– అనిత, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ

సంక్షేమంలో దేశానికే ఏపీ ఆదర్శం

- ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పథకాల అమలులో దేశానికే ఏపీ ఆదర్శం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చవటపాళెం, గొలగమూడి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలను మంత్రి ప్రారంభించారు. లబ్ధిదారులకు ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ తదితర సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాకాణి మాట్లాడుతూ గతంలో అధికారుల చుట్టూ ప్రజలు తిరిగే వారని, ప్రస్తుతం జగనన్న పాలనలో ప్రజల ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు అందుతున్నట్లు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ వసుమతి, తహసీల్దార్ కృష్ణ, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నంబూరు రాజానాయుడు, సర్పంచ్ కొమరిగిరి శీనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు డొంకల ప్రభాకర్‌నాయుడు, జె.వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు

- 238.4 కి.మీకు రూ.86.95 కోట్లు

నెల్లూరు(బారకాసు): జిల్లా రహదారుల అభివృద్ధికి మరోసారి ప్రభుత్వం నిధులిచ్చింది. వివిధ రహదారుల అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.86.95 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 238.4 కి.మీ మేర రహదారులు సుందరంగా రూపుదిద్దుకోనున్నాయి. ఇందులో రూ.56.2 కోట్లను 107.65 కి.మీ రాష్ట్ర రహదారులకు వినియోగించనున్నారు. అలాగే రూ.30.75 కోట్లను 130.75 కి.మీ జిల్లా, గ్రామీణ రహదారులకు ఖర్చు చేయనున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి రూ.20.55 కోట్లు, ఆత్మకూరుకు రూ.24.80 కోట్లు, సర్వేపల్లికి రూ.13.50 కోట్లు, కోవూరుకు రూ.8.70 కోట్లు, ఉదయగిరికి రూ.16 కోట్లు, కావలికి రూ.3,40 కోట్ల చొప్పున కేటాయించారు. పనులకు సంబంధించి త్వరలో టెండర్లు పిలువనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధరం గురువారం తెలిపారు.

సోమశిలలో 28.121 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 28.121 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2,300 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 280, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 91.038 మీటర్ల నీటి మట్టం ఉంది.

లోకేశ్ పాదయాత్రకు స్పందన కరువు

- బుచ్చిరెడ్డిపాళెంలో సభ
- మధ్యలోనే వెనుదిరిగిన జనం
- రాజ్యాంగ నిర్మాతను విస్మరించిన లోకేశ్



బుచ్చిరెడ్డిపాళెంలో లోకేశ్ ప్రసంగిస్తున్న సమయంలో వెళ్లిపోతున్న జనం

బుచ్చిరెడ్డిపాళెం/కోవూరు: టీడీపీ నాయకుడు నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్రకు స్పందన కరువైంది. ఆ పార్టీ నాయకులు జన సమీకరణకు ప్రయత్నిస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. దీంతో డబ్బులు ఇస్తామని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలను వాహనాల్లో తరలిస్తున్నారు. మండలంలోని చెల్లాయపాళెం క్రాస్ రోడ్డు నుంచి గురువారం సాయంత్రం 4.45 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యింది. క్రాస్‌రోడ్డు నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి లోకేశ్ పాదయాత్ర ద్వారా చేరుకున్నారు. అనంతరం స్థానిక చెన్నూరు రోడ్డులో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. రోడ్డుకిరువైపులా భారీగా ఫ్లెక్సీలు కట్టడంతో రోడ్డు 20 అడుగులకు కుచించుకుపోయింది. లోకేశ్ ప్రసంగిస్తున్న సమయంలో ప్రజలు తక్కువగా ఉండడంతో అసహనానికి గురయ్యారు. కాగా సభా వేదిక వద్దకు వచ్చే మార్గంలో జొన్నవాడ సర్కిల్లో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద లోకేశ్ ఆగకుండానే వెళ్లిపోయారు. మండలంలోని గ్రామాలకు చెందిన దినసరి కూలీలను టీడీపీ నాయకులు అతి కష్టం మీద పాదయాత్రకు తరలించారు.

జగన్ అంటే అభిమానం

పాదయాత్రకు వచ్చిన మహిళలు తమకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే అభిమానమని చెప్పారు. సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయని తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని తేల్చి చెప్పారు.

లోకేశ్‌వి అబద్ధాలు

యువగళం బహిరంగ సభలో లోకేశ్ పచ్చి అబద్ధాలు చెప్పాడని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ చూసి ఎమ్మెల్యే ప్రసన్నపై అవినీతి ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ప్రసన్న అవినీతి చేశారని ఆరోపిస్తున్న లోకేశ్ వాటిని నిరూపించే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. రైతులను చంద్రబాబు మోసం చేసినట్లు చెప్పారు.

కూలి ఇస్తామంటే వచ్చాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా సాయం చేసే మనిషిని ఇప్పటి వరకు నేను చూడలేదు. రోజు కూలి ఇస్తామంటే వేగూరు నుంచి ఆటోలో ఇక్కడికి వచ్చాం. మేమంతా రాజన్న బిడ్డ జగనమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్న వైపే ఉంటాం.

– చిల్లకూరు మునెమ్మ, వేగూరు

అమ్మఒడి వస్తోంది



నా చిన్న బిడ్డ పూర్ణేష్ తల మంచి బడిలో నాలుగో తరగతి చదువుతున్నాడు. అమ్మఒడి వస్తోంది. ఇబ్బందే లేకుండా చదువుకుంటున్నాడు. డబ్బులిస్తామంటేనే పాదయాత్ర సభకు వచ్చాం.

– ఇండ్ల చెంచమ్మ, తలమంచి

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు : రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నతోనే సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక అల్లూరుపేటస త్రం, అల్లిమడుగు కాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వార్షిక క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో ప్రతిఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, కమిషనర్ ఫణికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నీలం సాయికుమార్, బీద రమేష్, మేడా కృష్ణారెడ్డి, దైవాదీనం, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్, మనోహర్, సుధాకర్, మాధవ్, కరుణాకర్, పోలయ్య, మధురెడ్డి, మల్లీ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

పూర్తిస్థాయిలో రూరల్ అభివృద్ధి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : రూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 29వ డివిజన్ గాంధీనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో స్థానిక సమస్యలను పలువురు ఎంపీ దృష్టికి తీసుకురాగా, వెంటనే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్ సత్తార్, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు సాయిరెడ్డి, షేక్.ఆసీఫ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి పాల్గొన్నారు.

'మా పథకాలనే కాపీ కొడుతున్నారు'



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం : అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతిపక్ష నేతలు అనేక హామీలు ఇస్తున్నారని, అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని ఇప్పటికే అమలు చేస్తున్నారని, మా పథకాలను కాపీ కొట్టడం కాకుండా కొత్తగా ఏమైనా ఉంటే చెప్పాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సంగం బిట్-2 సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించగా, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంగం పట్టణ జనాభా 15 వేలకు చేరుకుందని, దీనిని మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా అవసరమైన పనులు చేపడుతామన్నారు. ఇంజినీరింగ్, ఐటీఐ కళాశాలల సహకారంతో సంగంలో సర్వే చేపడుతామన్నారు. పట్టణంలో మురుగునీరు చెరువులోకి వెళ్తున్న విషయాన్ని గుర్తించామని, త్వరలో పరిష్కరిస్తామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఉలవపాడు : ముందు వెళ్తున్న మోటార్ బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయరహదారిపై రాజుపాళెం కూడలి వద్ద గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చాగల్లు గ్రామానికి చెందిన కొమరగిరి మల్లికార్జున (43) ద్విచక్రవాహనంపై ఉలవపాడు వస్తూ ఇంటి వద్ద వస్తువు మరిచిపోయాడని, మళ్లీ రాజుపాళెం కూడలి వద్ద మలుపు తిరిగి చాగల్లు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి బియ్యపు పొట్టుతో వెళ్తున్న లారీ మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న మల్లికార్జున అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై బాజిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాజారెడ్డి

• నియోజకవర్గ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి(రాజారెడ్డి) తెలిపారు. మండలంలోని వెంగళరావునగర్ గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని, మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు తనపై ఎంత అభిమానం ఉందో పరిచయ కార్యక్రమంతో తెలిసిందన్నారు. ప్రతిఒక్కరూ మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం అర్జీదారులకు ధ్రువపత్రాలు అందించారు. అలాగే పలువురు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీష్‌బాబు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, జెడ్పీ కోఆప్షన్ గాజుల తాజుద్దీన్, సర్పంచ్ ఎం.తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు అభినయ్‌రెడ్డి, కె.అబ్దుల్, మహ్మద్‌ఖాజా, తిరుపతి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 40 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు సిటీ : జిల్లాలోని ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండుల్లో ఖాళీగా ఉన్న 40 దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పీవీ శేషయ్య గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు డిపో పరిధిలో 3, కావలి 5, నెల్లూరు-1 డిపోలో 13, నెల్లూరు-2 డిపోలో 12, కందుకూరులో 4, రాపూరులో 3 ఖాళీ దుకాణాలు ఉన్నాయన్నారు. ఈనెల 13న మధ్యాహ్నం 2 గంటల్లోపు నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన టెండరు పెట్టెలో దరఖాస్తులు వేయాలన్నారు.

రెండో రోజు ఏసీబీ విచారణ

చేజర్ల : మండలంలోని కొలవనాయుడుపల్లి వీఆర్వో రాజా అవినీతికి పాల్పడి బుధవారం ఏసీబీకి చిక్కిన నేపథ్యంలో గురువారం కూడా విచారణ కొనసాగింది. ఏసీబీ డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ గురువారం చేజర్ల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందిని, పలువురు వీఆర్వోలను విచారించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.10
పండ్లు : రూ.4

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.112/2016/ఏ1 తేది.06.07.2023

బహిరంగ వేలము ప్రకటన

నెల్లూరు నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్నటువంటి ఈ దిగువ తెలిపిన మార్కెట్‌లు మరియు గొర్రెల మరియు పశువుల గంజిఖానాలకు సంబంధించి 2023-24వ సంవత్సరమునకు గాను బహిరంగ వేలము నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయములో తేది. 13.07.2023న ఉదయం 11 గంటలకు నిర్వహించబడును.

ఈ దిగువ చూపబడిన పట్టికలో వరుస నెం.3,4 మరియు 6 లకు జరుపు వేలంపాట నందు మత్స్యకారులు / మత్స్యకారుల సొసైటీ వారు మాత్రమే పాల్గొనవలయును మరియు బహిరంగ వేలములో పాల్గొనుటకు ధరావత్తు (Deposits) సొమ్ము చెల్లించేటప్పుడు వారి యొక్క కుల ధృవీకరణ పత్రమును లేదా ప్రస్తుత మత్స్యకారుల సొసైటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను ఈ కార్యాలయమునకు సమర్పించవలెను.

సదరు బహిరంగవేలంలో పాల్గొనదలచిన పాటదారులు ఈ దిగువ తెలిపిన విధముగా పూర్తి వివరములతో మరియు గెజిట్ నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం వేలంపాటలో పాల్గొనవచ్చును.

వ సంఖ్య	ప్రాంతము పేరు	కాల పరిమితి	డిపాజిట్ (రూ.)	సాల్వెన్సీ
1	Dycus Road గొర్రెల గంజిఖాన	8 నెలలు	35,000	2,00,000
2	Dycus Road పశువుల గంజిఖాన	8 నెలలు	15,000	50,000
3	Dycus Road చేపల మార్కెట్	8 నెలలు	1,35,000	4,00,000
4	Settigunta Road చేపల మార్కెట్	8 నెలలు	15,000	1,00,000
5	Santhapet పశువుల గంజిఖాన	8 నెలలు	15,000	50,000
6	Mypadu Road చేపల మార్కెట్	8 నెలలు	1,35,000	4,00,000
7	Mypadu Road మటన్ మార్కెట్	8 నెలలు	70,000	2,00,000
8	Dycus Road లోని చేపలు శుభ్రపరచగా వచ్చు వ్యర్థములు	8 నెలలు	1,35,000	4,00,000
9	Settigunta Road లోని చేపలు శుభ్రపరచగా వచ్చు వ్యర్థములు	8 నెలలు	35,000	1,00,000
10	Mypadu Road లోని చేపలు శుభ్రపరచగా వచ్చు వ్యర్థములు	8 నెలలు	35,000	2,00,000

పై తెలిపిన మార్కెట్‌లకు మరియు గొర్రెల పశువుల గంజిఖానాలకు సంబంధించిన వివరములకు కార్యాలయము పని చేయు వేళలో రెవెన్యూ సూపరింటెండెంట్ గారిని లేదా A1 గుమస్తా గారిని సంప్రదించి వివరములు తెలుసుకొనవలసినదిగా కోరడమైనది.

సం/- **కమీషనరు,** నగరపాలక సంస్థ, నెల్లూరు

భవన నిర్మాణాల పూర్తికి చర్యలు

• కలెక్టర్ హరినారాయణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట) : జిల్లాలో నూతన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల భవన నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉదయం వెలగపూడి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, నగరంలోని కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ హరినారాయణన్ పాల్గొని ప్రాధాన్యత క్రమంలో చేపట్టిన నిర్మాణాల గురించి వివరించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద లక్ష్యం మేరకు పని దినాలు కల్పించామని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. అలాగే రీసర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ కూర్మనాథ్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు అశోక్‌కుమార్, రంగవరప్రసాద్, గంగాధర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డ్వామా పీడీ వెంకట్రావు, సీపీఓ ఎస్.రాజు, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ జేడీలు నాగేశ్వరరావు, మహేశ్వరుడు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

లోకేశ్‌ను ప్రజలు నమ్మరు

• వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట) : యువగళం పేరుతో లోకేశ్ చేస్తున్న పాదయాత్రను ప్రజలు నమ్మరని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు తన పాదయాత్రలో 650 హామీలిచ్చి గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో దాదాపు 140 బహిరంగ సభలు, లెక్కలేనన్ని ఆత్మీయ సభలు నిర్వహించడంతో ప్రజలు నమ్మి పట్టం కట్టారని గుర్తుచేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

10న జెరూసలెం యాత్ర

నెల్లూరు (వేదాయపాళెం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జెరూసలెం యాత్రకు 14వ బృందాన్ని పంపిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎ.నిర్మలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెరూసలెం యాత్రకు జిల్లా నుంచి 34 మంది క్రైస్తవ సంఘీయులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని తల్పగిరి కాలనీ, అయ్యప్పగుడి సెంటర్‌లో యాత్ర బయలుదేరుతుందని, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అమర్లపూడి శేఖర్ జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తారన్నారు.

అనుమానం పెనుభూతమై..

• భార్యను హత్య చేసిన భర్త
• ఆపై తానూ ఆత్మహత్యాయత్నం



మణెమ్మ(ఫైల్)



చికిత్స పొందుతున్న శ్రీనివాసులును విచారిస్తున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

వెంకటాచలం: అనుమానం పెనుభూతమై ఓ పచ్చని కాపురాన్ని చిదిమేసింది. ఓ భర్త కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా చంపి తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చెముడుగుంటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలి తల్లి కోలగట్ల సుమతి గురువారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి గ్రామానికి చెందిన తాటిపర్తి శ్రీనివాసులుకు ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి పంచాయతీ లింగాయపాళెం గ్రామానికి చెందిన తాటిపర్తి మణెమ్మ(25)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. శ్రీనివాసులు కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. అయితే వివాహం జరిగిన కొన్ని నెలల నుంచే అనుమానంతో భార్య మణెమ్మను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఇద్దరు కుమారులు తనకు పుట్టలేదని తరచూ గొడవ పడేవాడు. ఇద్దరి మధ్య గ్రామపెద్దలు రాజీ కుదిర్చే ప్రయత్నం చేసినా మార్పు లేకపోవడంతో రెండున్నర నెలల క్రితం మణెమ్మ ఇద్దరు కుమారులను తీసుకుని నెల్లూరు నగరం, గాంధీనగర్‌రోడ్డు వద్ద నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది.

పథకం ప్రకారం హత్య

తల్లిదండ్రుల వద్ద ఉంటున్న మణెమ్మను కాపురానికి రావాలని భర్త ఇటీవల వెళ్లి బెదిరించాడు. అయినా ఆమె రాలేదు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం చీటీ డబ్బులు చెల్లించేందుకు మణెమ్మ కుంకుమపూడి గ్రామానికి వచ్చింది. ఇది తెలుసుకున్న శ్రీనివాసులు ఎలాగైనా మణెమ్మను చంపాలని చాకును తన వెంట తీసుకెళ్లాడు. ఆమెకు మాయమాటలు చెప్పి ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో మణెమ్మను చాకుతో విచక్షణారహితంగా పొడవడంతో రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో తాను కూడా చనిపోవాలని చాకుతో దవడ కింద భాగం, ఛాతి కింద భాగంలో పొడుచుకున్నాడు. దీంతో పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు వెంకటాచలం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ గంగాధర్‌రావు, ఎస్సై అయ్యప్ప ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తీవ్రగాయాలతో ఉన్న శ్రీనివాసులును చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి బుధవారం అర్ధరాత్రి ఆస్పత్రికి వెళ్లి విచారించారు. తన కుమార్తెను ఆమె భర్తే హత్య చేశాడని మృతురాలి తల్లి సుమతి వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గురువారం ఉదయం క్లూస్ టీమ్‌ను రప్పించి మృతదేహం వద్ద వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.